**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

**ఫోన్ - 8985829417**

**సూర్య ప్రభ**

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 365 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | బుధవారం, జూన్ 25 2025 | పేజీలు : 4

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడొద్దు..




హైదరాబాద్, జూన్ 24: గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ ఉప ఎన్నికలో గెలవాల్సిందే అని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందరినీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక.. అభ్యర్థి ఎంపికకు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ నడుస్తోంది.

తామే అభ్యర్థుల మంటూ కొంతమంది తేల్చిచెబుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత ఇచ్చారు. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని చెప్పారు. అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని సీఎం ఆదేశించారు. ఏ ఎన్నిక జరిగినా ఒకే ప్రక్రియ ప్రకారం అభ్యర్థి ఎంపిక ఉంటుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కూడా అదే ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఇక.. పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతోందని వారు చెప్పుకొచ్చారు.

**గొర్రెలతో నిరసనపై సీఎం సీరియస్...** మరోవైపు నిన్న గాంధీ భవన్‌లో గొర్రెలతో నిరసన చేయడంపై సీఎం చాలా సీరియస్ అయ్యారు. గాంధీ భవన్‌లో ఇలాంటివి ఎంటర్ టైన్ చేయొద్దని ఆదేశించారు. నిరసనకు ఓ పరిమితి ఉంటుందన్నారు. కాంగ్రెస్ అందరి అభిప్రాయం తీసుకుంటుందని.. అందరినీ గౌరవిస్తుందన్నారు. ఇది పార్టీ ఆఫీసా ఇంకా ఏమైనానా అని గాంధీభవన్ ఆఫీస్ బేరర్స్‌ను ప్రశ్నించారు. ఇష్టా రీతిలో నిరసనలు చేస్తుంటే ఏం చేస్తున్నారు అని సీఎం ప్రశ్నించారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని సీఎం హెచ్చరించారు.

**ఇంచార్జ్ మంత్రులపై అసంతృప్తి...** అలాగే ఇంచార్జ్ మంత్రుల పనితీరుపై కూడా సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే భాధ్యత ఇంచార్జ్ మంత్రులకు అప్పగించినా చేయడం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇంచార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రుల దగ్గర ఫండ్స్ పెట్టామని, వాటిని సరిగ్గా ఉపయోగించడం లేదని పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# ఎన్నికల్లో గెలిచే దమ్ము లేకే ఫోన్ ట్యాపింగ్.. బీఆర్ఎస్‌పై ఎంపీ ఈటల రాజేందర్ ఫైర్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ నేతలు ఈటల రాజేందర్, ప్రేమేందర్ రెడ్డి వాంగ్మూలాలను ఇవాళ(మంగళవారం) సిట్ అధికారులు నమోదు చేశారు. 2023 నవంబర్ ఎన్నికల సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీరిద్దరి ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటి వరకు 4వేల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు కనుక్కున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈటల స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి బాధితుడిని తనేనంటూ ఈటల ఆరోపించారు. తన కుటుంబ సభ్యులు, డ్రైవర్లు, గన్‌మెన్‌లు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపణలు చేశారు. హుజురాబాద్ ఉప ఎన్నికతో పాటు అంతకుముందు, తర్వాత కూడా ఫోన్ ట్యాపింగ్‌కి గురైనట్లు సిట్ గుర్తించింది.

అలాగే.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సిట్ అధికారులకి ఫిర్యాదు చేశారు. 2020 నుంచి 2024 వరకు తన ఫోన్ సంభాషణలను రహస్యంగా తెలుసుకున్నారని ఫిర్యాదులో మాధవరం కృష్ణారావు తెలిపారు. కుట్ర పూరితంగా కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేసినట్లు సిట్‌కి తెలంగాణ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెజండ్ల కిషోర్ బాబు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలను సిట్ అధికారులకి కిషోర్ బాబు ఇచ్చారు.

# ఆమ్రపాలికి క్యాట్‌లో ఊరట.. మళ్లీ తెలంగాణకే కేటాయింపు



దిల్లీ: తెలంగాణ నుంచి రిలీవై ఏపీ క్యాడర్‌లో చేరిన ఐఏఎస్ అధికారిణి కాటా ఆమ్రపాలికి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)లో ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది.

గతంలో తెలంగాణలో పని చేసిన ఆమె.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులతో నాలుగు నెలల క్రితం ఏపీకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకు కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అనుమతించిన క్యాట్.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.




# 'స్థానికం' ఇప్పట్లో లేనట్టే..!

## అడ్డుపడుతున్న మూడు కారణాలు!!

హైదరాబాద్ : తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ ఎస్, బీజేపీ, ఇతర పక్షాలు ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. ప్రధానంగా మూడు కారణాలు అడ్డు పడుతున్నాయని తెలుస్తోంది. తాజాగా సోమవారం ఈ వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరిగినప్పుడు ప్రభుత్వం కీలక విషయాన్ని వెల్లడించింది. ఎన్నికలు ఇప్పట్లో జరిపే ఉద్దేశం ఉన్నా.. ఇప్పట్లో జరపలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం కుల గణన ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని.. పూర్తిస్థాయి లో నివేదిక రావాల్సి ఉందని తెలిపింది. అయితే.. కోర్టు ప్రభుత్వాన్ని సీరియస్‌గా ప్రశ్నించింది. "ఇంకా ఎన్నాళ్లు ఈ ప్రక్రియను సాగదీస్తారు?" అని నిలదీసింది. దీంతో మరో నెల రోజులు అయినా తమకు సమయం పడుతుందని.. అప్పటి వరకు సమయం ఇవ్వాలని కోరింది. మరోవైపు.. ఎన్నికల కమిషన్ అధికారులు కూడా తమకు ఏర్పాట్లు చేసేందుకు, నిర్వహించేందుకు కనీసంలో కనీసం 60 రోజులు(రెండు మాసాలు) పడుతుందని.. అప్పటి వరకు సమయం ఇవ్వాలని కోరింది. దీనిపై హైకోర్టు స్పందించలేదు. వాస్తవానికి గత ఏడాది ఫిబ్రవరి 1నే గ్రామ స్థాయి స్థానిక సంస్థలకు కాలం ముగిసింది. అప్పటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయితీలకు చెందిన సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తాత్సారం చేస్తోందని.. ఈ నేపథ్యంలో తమను పొడిగించాలని.. కోర్టును కోరారు. లేకపోతే, వెంటనే ఎన్నికలు పెట్టేలా అయినా.. సర్కారును ఆదేశించాలని వారు కోరారు. ఈ పిటిషన్లను కలిపి విచారిస్తున్న కోర్టులోనూ వాయిదాలపై వాయిదాలు పడుతున్నాయి. దీంతో పంచాయతీలు, గ్రామాల్లో ఎటుచూసినా ఈ చర్చే కనిపిస్తోంది. వినిపిస్తోంది. ఇక, ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంపై ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పట్లో ఎన్నికలకు అవకాశం కనిపించడంలేదని తెలుస్తోంది.

**కారణం ఏంటి?...** అయితే.. అసలు ఎన్నికల విషయంపై కాంగ్రెస్ సర్కారు వెనుకంజ వేయడానికి పైకి చెబుతున్న కుల గణన మాత్రమే కారణం కాదని తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా నిధులు ఇప్పుడిప్పుడే పడుతున్నాయి.

రైతుల నాడిని ప్రభుత్వం పసిగట్టాల్సిన అవసరంఉంది దీనికితోడు ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం కూడా.. చర్చకు వస్తోంది. ఈ రెండు కీలక అంశాలు.. పంచాయతీ ఎన్నికలపై ప్రభావం చూపిస్తాయి. మరోవైపు.. సర్కారుపై పూర్తిస్థాయిలో సంతృప్తి వచ్చిందా? లేదా? అనేది కూడా ప్రభుత్వానికి సందేహంగా మారింది.

ఈ క్రమంలోనే ప్రజల్లోకి వెళ్లాలని నాయకులకు మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. వెరసి.. ఎన్నికల వాయిదాకు పలు కారణాలు కనిపిస్తున్నాయి.

# ఏం చేస్తున్నారో అర్థం అవుతోందా?

## మంత్రులు, నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి అసహనం!




హైదరాబాద్ : వర్గవిభేదాలు పక్కన పెట్టి, పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, నేతలకు స్పష్టం చేశారు. నేడు జరిగిన పీఏసీ మీటింగ్ లో మంత్రుల పనితీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు ఎమ్మెల్యేలపై కూడా రేవంత్ ఫైర్ అయినట్లు సమాచారం. అంతర్గతంగా మాట్లాడుకోవాల్సిన పార్టీ విషయాలను ప్రెస్ మీట్లు పెట్టి, సభల్లో మాట్లాడడం ఏంటని ఆయన ఫైర్ అయ్యారు. గొడవలతో పార్టీకి నష్టం చేస్తామంటే ఊరుకోనని వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

పార్టీకి వ్యతిరేకంగా ర్యాలీలు, ధర్నాలు చేస్తే బాగుండదని తేల్చిచెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలవాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. పొన్నం ప్రభాకర్ సారథ్యంలో హైదరాబాద్ జిల్లా నేతలు ఇందు కోసం పని చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.

**సరిగా పని చేయకుంటే ఎన్నికల ముందు తొలగిస్తాం.. పార్టీ నేతలకు రేవంత్ రెడ్డి హెచ్చరిక...** కాంగ్రెస్ పార్టీలో కష్టపడితే కచ్చితంగా పదవులు వస్తాయని ఇప్పుడున్న చాలా మంది నేతలు కింది స్థాయి నుంచి వచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే నా ఎదుగుదల సాధ్యమైందని పార్టీ బాధ్యత మోసిన వారికే ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఇవాళ గాంధీభవన్ లో పీఏసీ మీటింగ్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ నూతన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ రచించిన 'విధ్వంసం నుంచి వికాసం వైపు' పుస్తకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఎంతో మంది పదవుల కోసం పోటీ పడ్డారన్నారు. మీరంతా పార్టీ నిర్మాణంలో కీలక భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. మన ప్రభుత్వం అనేక సక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, ఈ దేశంలో అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. కార్యకర్తల ఎన్నికలు (స్థానిక సంస్థల ఎన్నికలు) రాబోతున్నాయి. మన కార్యకర్తలను కష్టపడి గెలిపించుకోవాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందేనని పార్టీ నిర్మాణంలో కార్యకర్తలుక్రియాశీల పాత్ర పోషించాలన్నారు. పార్టీ కోసం పని చేయనివాళ్లను ఎన్నికల ముందు బాధ్యతల నుంచి తప్పిస్తామని హెచ్చరించారు.

**పదేళ్లు నాదే బాధ్యత:** ఉమ్మడి రాష్ట్రంలో 1994 నుంచి 2004 వరకు టీడీపీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని సీఎం చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలో ఉందని 2023 నుంచి 2033 వరకు పదేళ్లు కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలో ఉండబోతున్నదన్నారు. ఈ పదేళ్లు పార్టీ కోసం పని చేసే వారిని కాపాడుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. పదేళు అధికారం నడిపించే వరకు నేను బాధ్యత తీసుకుంటా. ఆ తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి నడిపించాల్సిన బాధ్యత పార్టీలోని యువతరం తీసుకోవాలని చెప్పారు. రెండోసారి అధికారంలోకి రావడం కార్యకర్తల చేతుల్లో ఉందని, ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు అందుబాటులోకి తేవాలన్నారు. పార్టీ పదవులను చిన్నచూపు చూడవద్దని ఈ పార్టీ పదవులే మిమ్మల్ని పెద్ద నాయకులుగా తీర్చిదిద్దుతుందన్నారు. కులగణన చేసి మోడీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతో పాటు కలగణన చేసే పరిస్థితి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. త్వరలో డీలిమిటేషన్ జరగబోతున్నదని సీట్లు పెరగబోతున్నాయన్నారు. మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయి. జమిలీ ఎన్నికలు తేస్తామని చెబుతున్నారని ఆ సమయానికి మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ 18 నెలలో గోల్డెన్ పీరియడ్ అని అన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ లేకుండా నడిపిస్తున్న వ్యాపార కేంద్రాల పై చర్యలు తీసుకోండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ సర్కిల్ లోని అనేక ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కేంద్రాలను నడిపిస్తు, అక్రమ వ్యాపారం చేస్తూ నకిలీవి వాడుతు వినియోగదారులను మోసం చేస్తున్నారని,టాక్స్ లు కూడా లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రభుత్వ అందయానికి గండి కొడుతూ ప్రజల వద్ద అధిక ధరలకు అమ్ముతు





న్నారని కావున అలాంటి వ్యాపార కేంద్రాలను మూసి వెయ్యాలని, అలాగే షాప్ లను రోడ్డు పైనవరకు షెడ్డులు వెయ్యడం వల్ల రోడ్డు పైన పార్కింగ్ వల్ల ట్రాఫిక్ ఏర్పడుతుందని అలాంటి వాటిని వెంటనే తొలగించాలని నేడు సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నర్సింహా కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఇలాంటివి తమ దృష్టిలో ఉన్నాయని అలాంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి,సహాయ కార్యదర్శి హరినాథ్,సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి, కనకయ్య,ప్రభాకర్,వంశీ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా : బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ....

కుత్బుల్లాపూర్ (సూర్యప్రభా)గాజుల రామారం 125 డివిజన్ ఏరోనాటిక్స్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ – ఏరో నగర్ (ప్రగతి నగర్) సంక్షేమ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలోని మౌలిక వసతులపై వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... గత పదేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లు, వార్డుల్లోని అనేక ప్రాంతాలలో





మౌలిక వసతులను కల్పించామని, రానున్న రోజుల్లో ఏరో నగర్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరోనాటిక్స్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఏ.తిరుపతి రావు, సెక్రటరీ టి. రాజగోపాల్, కోశాధికారి కె. సాయి ప్రసాద్, ఉపాధ్యక్షులు ఏ. వీరా రాణి,కాలనీ వాసులు సుబ్బుయార్లగడ్డ పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలపై కసరత్తు

ధర్మపురి: మరో రెండేళ్లలో జరగనున్న గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటినుంచే సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలయిన ధర్మపురి, కోటిలింగాల, మంథని, కాళేశ్వరంలలో పుష్కర ఘాట్లపై ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభిం చారు. జులై 23, 2027 నుంచి 12 రోజులపాటు భక్తులు పుణ్యస్నానా లు ఆచరించనున్నారు. ఇందుకుగానూ ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లి అక్కడి ఏర్పాట్లను రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు పరిశీలించి వచ్చారు. బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచ లం లాంటి పుణ్యక్షేత్రాల ద్వారా గోదావరి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుం ది. రానున్న పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో.. ఇందుకోసం రూ.50 కోట్ల వరకు వెచ్చించాలని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముఖ్యంగా ధర్మపురి క్షేత్రానికి ప్రాధాన్యతనివ్వనున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 17 చోట్ల..**

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆదేశాలతో గత నెలలో పర్యాటక, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాథమిక సమాచారాన్ని తెలుసుకున్నారు. తాజాగా రెండ్రోజుల కిందట దేవాదాయశాఖ కమిషనర్ పుష్కరాల ఏర్పాట్లపై ప్రాథమికంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈవోలతో చర్చించారు. ఉమ్మడి జిల్లాలో ధర్మపురి, కోటిలింగాల, మంథని వద్ద 17 ఘాట్లను ప్రాథమికంగా గుర్తించారు.

**పెద్ద ఎత్తున ఏర్పాట్లు**

ధర్మపురిలో గతంలో సంతోషిమాతా, మంగళిఘాట్, సోమవిహార్, మహాలక్ష్మి పుష్కరఘాట్లను నిర్మించారు. ఏఏ క్షేత్రాల్లో ఎంతమంది హాజరయ్యారో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. నూతన ఘాట్ల నిర్మాణం అవసరం ఉందా? ఉంటే ఎక్కడ నిర్మించాలనే దానిపై ప్రాథమికంగా చర్చించారు. గతంలో నిర్మించినవాటి పరిస్థితి ఎలా ఉంది? మరమ్మతులు అవసరాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మొత్తానికి రానున్న పుష్కరాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పెద్దఎత్తున ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతోంది.

# నిరుపేదల ఆర్థిక చేయూతనిచ్చేది ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ...

### చింతల్ లోని ఎంఎల్ఏ కార్యాలయంలో రూ.10 లక్షల విలువైన 26 సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేత....







కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)నిరుపేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ కె.పి.వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సుమారు 10 లక్షల రూపాయల విలువగల 26 చెక్కులను లబ్ధిదారులకు ఇవాళ చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, నాయకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఆర్థిక చేయూతనిస్తూ అర్హులైన ప్రతీ ఒక్క నిరుపేదను ఆదుకునేలా ప్రభుత్వం తరపున ఈ సాయం ఎంతో అవసరమవుతుంది అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, వీరంశెట్టి, లక్ష్మణ్, పాపులు గౌడ్, విఘ్నేష్, మనోజ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగం.. ఆశాభంగం



హైదరాబాద్: భాగ్యనగర పర్యాటకంపై ఉదాసీనత కొనసాగుతోంది. నూతన విధానం అందుబాటులోకి వచ్చినా కార్యాచరణతో ముందుకు సాగడంలేదు. నగరం నుంచి ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు వివిధ పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేసే లక్ష్యం కార్యరూపం దాల్చడంలేదు. చార్మినార్, పైగా టూంబ్స్, లాడ్ బజార్, సాలార్‌జంగ్ మ్యూజియం, నిజాం మ్యూజియం, చౌమొహల్లా ప్యాలెస్‌లను అనుసంధానం చేస్తూ చార్మినార్ క్లస్టర్‌ను గోల్కొండ, కుతుబ్‌షాహీ టూంబ్స్, తారామతి బారాదరి, ప్రేమామతిల తో గోల్కొండ క్లస్టర్‌ను అభివృద్ధి చేసే ప్రతిపాదనలపై ఉదాసీనత కొనసాగుతోంది. ఆర్కియాలజీ, కేంద్ర, సాంస్కృతిక శాఖలు, హెచ్ఎండీఏ మధ్య సమన్వయ లోపం సమస్యలకు దారి తీస్తోంది.

**అన్నీ చూడలేక**

నగరంలో అనేక పర్యాటక ఆకర్షణలున్నా కొన్నింటికే ఆదరణ ఉంటోంది. ప్రధానంగా సందర్శకులు చార్మినార్, గోల్కొండ, బిర్లామందిర్, ఎన్టీఆర్ గార్డెన్, హుస్సేన్‌సాగర్‌కు పరిమితమవుతున్నారు. ఎంతో చారిత్రక వారసత్వ సంపద కలిగి ఉన్న మ్యూజియంలు 3 ఉన్నా ఎక్కువమంది వీటిని సందర్శించడం లేదు. సాలార్‌జంగ్ మ్యూజియానికే తాకిడి ఉంటోంది. నిజాం మ్యూజియం ఉందని తెలిసిన వాళ్లే వెళ్తున్నారు. స్టేట్ మ్యూజియానికి సందర్శకులు కరవయ్యారు. పురావస్తుశాఖ కార్యాలయ ఆవరణలోని శ్రీశైలం పెవిలియన్ మూతపడింది. ఎన్టీఆర్ గార్డెన్స్‌లో ఒకప్పటి ఆకర్షణలు లేవు. చాలామంది అటువైపే చూడటం లేదు. లుంబినీ పార్క్, హుస్సేన్‌సాగర్ బోటింగ్‌కు మాత్రం ఆదరణ తగ్గడంలేదు. గోల్కొండకు వెళ్లేవారు విధిగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌కు వెళ్లాలనుకున్నా.. అక్కడ కనీస వసతుల్లేవు. బొటానికల్ గార్డెన్, బయోడైవర్సిటీ పార్కు వంటివి స్థానికులకే పరిమితం అయ్యాయి. లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ పర్యాటకంలో పూర్తిస్థాయిలో అంతర్భాగం కాలేదు. ఇటీవల జరిగిన ప్రపంచ సుందరి పోటీల్లో నగర పర్యాటకానికి ఎంతో ప్రచారం లభించింది. సుందరీమణులు కొన్ని ప్రాంతాలనే చూశారు. మెడికల్ టూరిజంలో పర్యాటకశాఖ పాత్ర నామమాత్రమేనని చెప్పొచ్చు.

# టోకెన్ సేకరించి.. టోకున తరలించి



రామడుగు: రామడుగు మండలంలోని మోతెవాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కార్యదర్శులు లబ్ధిదారులకు జారీ చేసిన టోకెన్లను సేకరించి.. అక్రమ దందా కొనసాగిస్తున్నారు. కోరిటపల్లి, షానగర్, గోలిరామయ్యపల్లి, రుద్రారం, మోతె, వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లోని మోతె వాగు నుంచి ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వుతున్నారు. రామడుగు నుంచి పెగడపల్లి, కోరిటపల్లి నుంచి గంగాధర, వన్నారం నుంచి కొత్తపల్లి, కరీంనగర్ మండలాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**ముందు బైక్.. వెనుక ట్రాక్టర్..**

రామడుగు మండలంలోని మోతెవాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారంతా ట్రాక్టర్‌కు ముందు బైకును పంపిస్తారు. ఎక్కడా ఇబ్బంది లేదని చెబితే.. ముందుకెళ్తారు. ఎక్కడైనా పోలీసులు, అధికారులు తనిఖీలు జరిగినట్లు కనిపిస్తే.. బైక్ వాళ్లు వెనుక వచ్చే ట్రాక్టర్‌ను అప్రమత్తం చేస్తారు. ఇలా అధికారులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. రోజుకు సుమారు వంద ట్రాక్టర్లు మోతె వాగు నుంచి తరలిపోతున్నాయి.

నిత్యం అక్రమ రవాణాకు పాల్పడేందుకు ఆయా గ్రామాల మలుపు వద్ద కొంతమందితో నిఘా ఏర్పాటు చేసుకొని దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పోలీసు వాహనం స్టేషన్ నుంచి బయలుదేరగానే నిఘా యువకులు సెల్‌ఫోన్ల ద్వారా ట్రాక్టర్ డ్రైవర్లకు సమాచారం ఇవ్వడంతో ఎవరికీ చిక్కకుండా పోతున్నారు.

**అనుమతికి మించి..**

మండలంలో 523 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. దీని కోసం ఇసుకను ఉచితంగా అందజేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో ఇంటికి వివిధ దశల్లో 25 క్యూబిక్ మీటర్లు(పది ట్రాక్టర్లు) ఇసుకను ప్రభుత్వం అనుమతించింది. లబ్ధిదారుల పేరిట పంచాయతీ కార్యదర్శులు టోకెన్లు జారీ చేశారు. వీటిని సేకరించి ట్రాక్టర్ల యజమానులు పక్క మండలాలకు ఇసుకను తరలిస్తున్నారు. మోతె వాగుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఎక్కడా అధికారుల తనిఖీ లేకపోవడంతో అక్రమ రవాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకు తరలించేందుకు రవాణా ఖర్చు కింద రూ.వేయి తీసుకుంటున్నారు. ఇది బాగానే ఉన్నా.. ఇక్కడి ఇసుకను పక్క మండలాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇతరులకు ట్రాక్టర్ ట్రిప్పు రూ.5 వేలు దండుకుంటున్నారు. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మోతె వాగుకు ఆనుకొని ఉన్న రైతులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదు. రేయింబవళ్లు అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

నా దృష్టికి రాలేదు– రాజేశ్వరి, తహసీల్దార్

మోతె వాగు నుంచి ఇతర మండలాలకు ఇసుక అక్రమ రవాణా నా దృష్టికి రాలేదు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా అందజేసేందుకు పంచాయతీ కార్యదర్శులకు టోకెన్లు జారీ చేశారు. స్థానికంగా రీచ్ లేనందున లబ్ధిదారుల ఇళ్ల వద్దకు ఇసుక రవాణాకు ఛార్జీలపై నిర్దిష్ట ఆదేశాలు రాలేదు.

## ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ...





కుత్బుల్లాపూర్ (సూర్య ప్రభా)కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారిని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు..ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు....

## గణనీయంగా సన్నాల సాగు!

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వం నిరుడు వానాకాలం, యాసంగిల్లో సన్నగింజ ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి కొనుగోలు చేయటంతో ఈ వానాకాలంలోనూ సన్నగింజ వరి రకాల సాగువిస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. మేలైన సన్నగింజ వరిరకాల విత్తనాలను రైతులకు ఇవ్వటం, సన్నాల సాగులో సమస్యల నివారణ, బోనస్ ఆలస్యం చేయకుండా సకాలంలో చెల్లించటం తదితరాలు రైతులకు చేదోడుగా నిలవనున్నాయి.

ఉమ్మడి జిల్లా రైతులు నిరుడు వానాకాలంలో 9.82 లక్షల ఎకరాల్లో వరి సాగుచేయగా ఇందులో 6.06 లక్షల ఎకరాల్లో దొడ్డుగింజ రకాలు, 3.76 లక్షల ఎకరాల్లో సన్నగింజ రకాలున్నాయి. ఈ వానాకాలంలోనూ ఇదేస్థాయిలో సన్నగింజరకాలను సాగుచేసే అవకాశముంది. సన్నగింజ రకాల్లో సుడిదోమల వంటి చీడపీడల తీవ్రత చాలాఎక్కువగా ఉంటుండటం, సస్యరక్షణ ఖర్చు, మందుల పిచికారీశ్రమ, లోతట్టు వందూరు భూములు అధికంగా ఉండటంతో దొడ్డుగింజ రకాలు కూడా అధికంగానే నార్లు పోస్తున్నారు. ఈ నేపథ్యంలో చీడపీడలను తట్టుకునే వంగడాలను ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ధాన్యం ఫైన్‌రకాలకు క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,303 మద్దతు ధరుంది. కేంద్రం క్వింటాలుకు రూ.69 చొప్పున పెంచిన ధరలు 2025 సెప్టెంబరు నుంచి ఏడాదిపాటు అమల్లో ఉంటాయి. మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ.500 చొప్పున



బోనస్‌ను రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుంది. నిరుడు వానాకాలం, ఈ యాసంగిల్లో బోనస్ చెల్లింపులో తీవ్రజాప్యంతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. ముమ్మందు బోనస్ చెల్లింపు జాప్యాన్ని నివారించాలి.

**అనువైన రకాలు**

నిరుడు వానాకాలంలో 33 సన్నగింజ రకాలను ప్రభుత్వం గుర్తించగా నిబంధనల మేరకున్న జైశ్రీరాం తదితర రకాలను కూడా కొనుగోలు చేశారు. గింజ పొడవు 6 మి.మీ కన్నా తక్కువ, వెడల్పు 2 మి.మీ కన్నా తక్కువుండాలి. పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మి.మీ.కంటే ఎక్కువుండాలి. గింజను గ్రెయిన్ కాలిపర్ మిషన్‌లో వేసి పొడవు, వెడల్పు కొలుస్తారు. జగిత్యాల పరిశోధనస్థానంలో రూపొందించిన జేజీఎల్1798, జేజీఎల్3844, జేజీఎల్3855, జేజీఎల్11727, జేజీఎల్11118, జేజీఎల్17004, జేజీఎల్11470, జేజీఎల్28545, జేజీఎల్27356, జేజీఎల్384, జేజీఎల్3828, కూనారం పరిశోధనస్థానం రకాలు కేఎన్ఎం 1638, కేఎన్ఎం 733, వరంగల్ పరిశోధనస్థానానికి చెందిన రకాలు వరంగల్962, వరంగల్1119, వరంగల్44, వరంగల్347, వరంగల్14, వరంగల్32100, వరంగల్697, రాజేంద్రనగర్ రకాలైన ఆర్ఎన్ఆర్15048(తెలంగాణసోన), ఆర్ఎన్ఆర్21278, ఆర్ఎన్2458, ఆర్ఎన్ఆర్2354, ఆర్ఎన్ఆర్2465, ఆర్ఎన్ఆర్2874, కేఎంఎస్2874, హెచ్ఎంటీ సోనా, బాపట్లకు చెందిన బీపీటీ5204, బీపీటీ 2595, మారుటేరుకు చెందిన ఎంటీయూ1262, ఎంటీయూ1271, ఎంటీయూ1282, నెల్లూరుకు చెందిన ఎన్‌డీఎల్ఆర్7, ఎన్ఎల్ఆర్34449, రుద్రూరు తదితర పరిశోధనస్థానాలనుంచి రూపొందించిన రకాలతో పాటు మరికొన్ని ప్రైవేటు సన్నగింజ రకాలు కూడా ఉన్నాయి.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడి

– డాక్టర్ బి.శ్రీనివాస్, వరి శాస్త్రవేత్త, జగిత్యాల పరిశోధనస్థానం

130 రోజుల పంటకాలంగల మధ్యకాలిక రకాలను జులై 10 వరకు, 120 రోజుల పంటకాలంగల స్వల్పకాలిక రకాలతో జులై నెలాఖరువరకు నార్లు పోసుకోవచ్చు. ఏ రకమైనా ఆగస్టు నెలాఖరులోపు నాట్లు పూర్తిచేయాలి. నేలల స్థితిగతులు, గతంలోని సాగు అనుభవాలనుబట్టి సన్నరకాలను ఎన్నుకోవాలి. రైతులు తోటిరైతుల వద్ద రైతువిత్తనాన్ని లేదా గతంలో మినీకిట్సగా తీసుకున్న సన్నవిత్తనాలను కూడా సాగుచేయవచ్చు. సన్నాల్లోనూ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడిని పొందవచ్చు.



# రాబోయే రోజుల్లో సవాళ్లు ఎదుర్కోబోతున్నాం

హైదరాబాద్: రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం చేయాలని చెప్పారు. “మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలి. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయి” అని రేవంత్‌రెడ్డి తెలిపారు. “ కులగణన చేసి మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలి. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు. పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకే తీరని నష్టం” అని సీఎం అన్నారు.



# సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయేలా ఉజ్జయిని మహంకాళి బోనాలు

హైదరాబాద్: సికింద్రాబాద్ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జులై 13న ఉజ్జయిని మహంకాళి బోనాల నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రజలందరి సహకారంతో బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి కోరారు. రాజకీయాలకు అతీతంగా అమ్మవారి బోనాలు నిర్వహించుకోవాలన్నారు. గతేడాది ప్రభుత్వం తరపున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా బోనాలు నిర్వహించామని గుర్తు చేశారు. బోనాల ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బోనాలతో వచ్చే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టర్ హరిచందన, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, విద్యుత్, అగ్నిమాపక, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

# ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాప్ చేశారు: ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. “మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి” అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

**భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్ చేశారు...** ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. “భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయింది”అని చెప్పారు.

# సంక్షేమ కార్యక్రమాలకు రూ.95,351 కోట్లు ఖర్చు: భట్టి విక్రమార్క



హైదరాబాద్: రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. “రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం” అని చెప్పారు.



# థాంక్యూ ట్రంప్.. ముప్పు తొలగింది..!

## థాంక్యూ ట్రంప్.. కాల్పుల విరమణను అంగీకరిస్తున్నాం: నెతన్యాహు కీలక ప్రకటన

పశ్చిమాసియాలో యుద్ధం చల్లారినట్లే కన్పిస్తోంది. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు దేశాలు అంగీకరించాయి. ఇప్పటికే టెహ్రాన్ కాల్పుల విరమణను మొదలుపెట్టగా.. సీజ్‌ఫైర్‌ను తామూ అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నుంచి అణుముప్పు తొలగిపోయిందని నెతన్యాహు అందులో పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలియజేశారు.

“ఆపరేషన్ రైజింగ్ లయన్ అన్ని లక్ష్యాలను ఇజ్రాయెల్ సాధించింది. ప్రత్యర్థి (ఇరాన్) నుంచి పొంచి ఉన్న రెండు ప్రధాన ముప్పులను (అణు, బాలిస్టిక్ క్షిపణులు) తొలగించాం. ఆపరేషన్‌లో భాగంగా టెహ్రాన్ గగనతలాన్ని ఐడీఎఫ్ పూర్తిగా తమ అధీనంలోకి తీసుకోగలిగింది. ఆ దేశ మిలిటరీ నాయకత్వాన్ని తీవ్రంగా దెబ్బకొట్టింది. ఇరాన్ ప్రభుత్వానికి చెందిన డజన్ల కొద్దీ ప్రాంతాలను ధ్వంసం చేసింది. మరో సీనియర్ అణు శాస్త్రవేత్తను కూడా హతమార్చింది. టెహ్రాన్ గుండెను ముక్కలు చేసింది” అని ఇజ్రాయెల్ పీఎంఓ కార్యాలయం తమ ప్రకటనలో వెల్లడించింది. “ఇజ్రాయెల్‌కు రక్షణపరంగా సహకారం అందించడమే గాక.. రణరంగంలోకి స్వయంగా అడుగుపెట్టి ఇరాన్ నుంచి పొంచి ఉన్న అణు ముప్పును తొలగించడంలో సాయం చేసిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. లక్ష్యాలు నెరవేరడంతో పాటు ట్రంప్ చేసిన సమన్వయంతో ద్వైపాక్షిక కాల్పుల విరమణ ఒప్పందం ప్రతిపాదనను మేం పూర్తిగా అంగీకరిస్తున్నాం” అని నెతన్యాహు ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతిచర్య మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్‌ను హెచ్చరించింది. ఇజ్రాయెల్, ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ట్రంప్ తొలుత పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తొలుత టెహ్రాన్ కాల్పుల విరమణ పాటిస్తుందని, ఆ తర్వాత ఇజ్రాయెల్ మొదలుపెడుతుందని ఆయన పేర్కొన్నారు. దీంతో యుద్ధానికి ముగింపు లభిస్తుందని తెలిపారు. ఈ ప్రకటన తర్వాత కూడా ఇరుదేశాల మధ్య దాడులు జరిగాయి. ట్రంప్ పోస్ట్ చేసిన ఆరు గంటల తర్వాత.. కాల్పుల విరమణను మొదలుపెట్టినట్లు టెహ్రాన్ ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజాగా నెతన్యాహు కూడా దీన్ని అంగీకరిస్తున్నట్లు వెల్లడించారు.



# కాల్పుల విరమణ కోసం ట్రంప్ ప్రాధేయపడ్డారు..!

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కోసం టెహ్రాన్‌ను ట్రంప్ ప్రాధేయపడ్డారట. ఈ ఒప్పందంపై నాయకులు, మీడియా నుంచి పొంతన లేని ప్రకటనలు.. కథనాలు వెలువడుతున్నాయి. తాజాగా ఇరాన్ ప్రభుత్వ రంగ మీడియా ఛానెల్ ఐఆర్ఐఎన్ఎన్ కొత్త ప్రకటన చేసింది. ఖతార్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విజయవంతంగా దాడి చేయగానే.. ఇజ్రాయెల్‌తో బలవంతంగా కాల్పుల విరమణ అంగీకరింపజేశారని పేర్కొంది. ఈ దాడి అనంతరం ఒప్పందం కోసం ట్రంప్ ఇరాన్‌ను ప్రాధేయపడ్డారని వెల్లడించినట్లు బీబీసీ పర్షియా పేర్కొంది. ఈసందర్భంగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్, ఆర్మీ, ఇరాన్ వాసుల ప్రతిఘటనను అభినందించింది. మరోవైపు ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటన తర్వాత కూడా ఇరాన్ దళాలు ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు కొనసాగిస్తున్నాయి. ఈ విషయాన్ని ఐడీఎఫ్ కూడా ధ్రువీకరించింది. తాజాగా జరిగిన క్షిపణి దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ వాసులు చనిపోయినట్లు ఎమర్జెన్సీ సర్వీస్ మేనేజ్‌మెంట్ పేర్కొంది. నేటి తెల్లవారుజామున ఇజ్రాయెల్–ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ పెట్టిన ట్రూత్ సోషల్ మీడియా పోస్టు సంచలనం సృష్టించింది. “ఇప్పటినుంచి దాదాపు ఆరు గంటల తర్వాత ఇరాన్–ఇజ్రాయెల్ పరస్పరం తుదివిడత దాడులు పూర్తి చేసుకొని గాయపడిన తర్వాత కాల్పుల విరమణకు అంగీకరించాయి. తొలుత అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత (అమెరికా కాలమానం ప్రకారం) ఇరాన్ కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 12 గంటలకు నుంచి ఇజ్రాయెల్ కాల్పుల విరమణను మొదలుపెడుతుంది. అలా 12 గంటలు ముగిసిన తర్వాత 12 రోజుల యుద్ధానికి అధికారిక ముగింపు లభిస్తుంది.

ఈ ఒప్పందం అమల్లో ఉన్న వేళ పరస్పరం శాంతియుతంగా, గౌరవ ప్రదంగా వ్యవహరించాలి” అని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ మాత్రం ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే తాము కాల్పుల విరమణ పాటిస్తామని చెబుతోంది. ఇక ట్రంప్ ప్రకటించిన 6 గంటల గడువు కూడా ముగిసింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై టెహ్రాన్ మరిన్ని క్షిపణులు ప్రయోగించినట్లు వార్తలొస్తున్నాయి.

# పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు



హైదరాబాద్: క్వారీ యజమానిని బెదిరించిన కేసులో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ ముగించింది. వరంగల్ కోర్టు ఇప్పటికే బెయిల్ ఇచ్చినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది రమణారావు కోర్టుకు వివరించారు. సుబేదారీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఈ నెల 16న కౌశిక్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 17న విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఇవాళ్టికి (మంగళవారం)వాయిదా వేసింది. ఆ లోపే 21న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు.. వరంగల్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది. బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ముగించింది.

# ప్రియుడితో కలిసి తల్లిని హతమార్చిన బాలిక

హైదరాబాద్: జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి హత్య జరిగింది. ప్రేమకు అడ్డు చెప్పిందనే కారణంతో కన్నతల్లిని పదో తరగతి చదివే కుమార్తె ప్రియుడితో కలిసి హతమార్చింది. పోలీసుల కథనం ప్రకారం.. విద్యార్థినికి కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడు పరిచయమయ్యాడు. అతడితో ప్రేమాయణం సాగించిన బాలిక ఇంటి నుంచి వెళ్లి పోయింది. తన కుమార్తె కనిపించడం లేదని తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గత రాత్రి ప్రియుడితో కలిసి బాలిక ఇంటికి వచ్చింది. నిద్రిస్తున్న తల్లి అంజమ్మ గొంతు నులిమి, కర్రతో తలపై కొట్టి చంపినట్టు సమాచారం. ప్రియుడు, అతడి తమ్ముడితో కలిసి బాలిక ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.



# రైల్వే టికెట్ ఛార్జీల పెంపు.. జులై 1 నుంచి అమల్లోకి!

ట్రైన్ టికెట్ ధరలు స్వల్పంగా పెరగనున్నాయి. జులై 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. నాన్ ఏసీ మెయిల్/ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధర కిలోమీటర్‌కు 1 పైసా, ఏసీ తరగతి టికెట్ ధర కిలోమీటరుకు 2 పైసలు చొప్పున పెరగనున్నాయి. రైల్వే వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్లమీడియా వెబ్‌సైట్లలో వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. చాలా ఏళ్ల తర్వాత రైల్వే టికెట్ ధరలు సవరిస్తుండడం గమనార్హం. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకు సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఈ పెంపు వర్తించదు. 500 కిలోమీటర్లు దాటితే కిలోమీటరుకు ఒక పైసా చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తత్కాల్ టికెట్‌కు సంబంధించి రైల్వే శాఖ ఇటీవలే కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆధార్ అథంటికేషన్ ఉన్న వారికి తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. జులై 1 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. అదే రోజు నుంచి టికెట్ ధరల పెంపు కూడా అమల్లోకి రానున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. నెలవారీ సీజన్ టికెట్ ధరల్లోనూ ఎలాంటి మార్పూ ఉండబోదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## డైవర్స్ తీసుకునే డబ్బున్నోళ్లే టార్గెట్.. రెండేళ్లలో 12 పెళ్లిళ్లు!

ఓ యువతి, మరో ముగ్గురితో కలిసి ఆడుతున్న పెళ్లి డ్రామా బయటపడింది. రెండేళ్లలో 12 పెళ్లిళ్లు చేసుకున్న ఆ మాయ లేడీ కోట్ల రూపాయల మేర మోసానికి పాల్పడింది. కిలేడీ చేతిలో మోసపోయిన వారు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగు చూసింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం పట్టణానికి చెందిన నిత్య పెళ్లి కూతురు కొందరిని టార్గెట్ చేసుకుని పెళ్లి డ్రామాకు తెరలేపింది. పెళ్లి చూపుల్లోనే మూడు ముళ్లు వేయించుకుని, ఆ తర్వాత విభేదాలు డ్రామాతో సెటిల్మెంట్లకు తెరతీసేదని బాధితులు అమలాపురం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివాహమై భార్యతో మనస్పర్థలు వచ్చి విడాకుల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారినే టార్గెట్ చేసుకున్న నిత్య పెళ్లికూతురు రెండేళ్లలో దాదాపు 12 మందిని మోసం చేసినట్లు చెబుతున్నారు. ఆమె చేతిలో మోసపోయిన వారిలో ధనవంతులు, వయసు పైబడిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు, భార్యతో తగాదా పడి వేరుగా ఉంటున్న పురుషులు ఉన్నారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నిందితురాలు బేతి వీర దుర్గ నీలిమ సమస్యల్లో ఉన్న పురుషులను



కలిసి పరిచయం చేసుకునేదాని, ఆ తర్వాత పెళ్లి చూపులు, పెళ్లి అంటూ డ్రామాలు ఆడేదని చెబుతున్నారు. భార్యకు దూరంగా ఉన్నవారితోనూ, పెళ్లికాని ధనవంతులతోనూ ముందుగా పరిచయం చేసుకుని వారితో సన్నిహితంగా మెలిగేదని, తర్వాత తన బృందంలోని మిగతా సభ్యులతో కలిపి పెళ్లి డ్రామాకు తెరతీసేదని అంటున్నారు. నీలిమకు దర్గ, వీరలక్ష్మి, కల్యాణ్ అనే వ్యక్తులు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. వీరు నలుగురు ఓ కుటుంబంగా డ్రామా ఆడి మోసం చేసేవారని బాధితులు తెలిపారు. పెళ్లి చూపుల్లోనూ పెళ్లి చేసుకొందామని ప్రతిపాదించడం, మిగిలిన సభ్యుల భరోసాతో తాళికట్టించేవారని అంటున్నారు. పెళ్లి అయిన తర్వాత అత్తవారింటికి వెళ్లేందుకు ఇష్టపడేది కాదని, భర్త ఎదురుతిరిగితే కేసులు పెడతామని బెదిరించేదని అంటున్నారు. రహస్య పెళ్లి, కాపురం ఫొటోలు దగ్గరపెట్టుకుని బ్లాక్ మెయిలింగ్ చేసేదని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. భార్యగా తనకు ఆస్తిలో వాటా ఇవ్వాలని లేదంటే కోర్టుకీడిస్తామని బెదిరించడంతో కొందరు లక్షల్లో డబ్బులు ముట్టజెప్పారని అంటున్నారు. ఇలా నలుగురు సభ్యుల ముఠా కోట్లలోనే దండుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

## కాల్పుల విరమణ వేళ ఇరాన్ మాటలు, చేతలు మామూలుగా లేవుగా?



గత కొన్ని రోజులుగా క్షిపణులతో దాడులు చేసుకుంటున్న ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయి అంటూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరికొన్ని గంటల్లోనే కాల్పుల విరమణ జరగనుందని తెలిపారు. ఇదే సమయంలో.. 24 గంటల తర్వాత యుద్ధం అధికారికంగా ముగియనున్నట్లు ప్రకటించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు టెహ్రాన్ నుంచి భిన్నమైన ప్రకటన వచ్చింది. ఇందులో భాగంగా.. తొలుత అలాంటి ఒప్పందమేదీ లేదని పేర్కొన్న ఇరాన్.. ఆ తర్వాత కాల్పుల విరమణకు సుముఖంగానే ఉన్నట్లు సూచనప్రాయంగా చెప్పింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ రెండు విభిన్న పోస్టులు చేశారు. అయితే.. ఇజ్రాయెల్ నుంచి మాత్రం ఇంకా ప్రకటన రాలేదు. మరోవైపు ట్రంప్ కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటన తర్వాత కూడా ఇరాన్ దళాలు ఇజ్రాయెల్ పై క్షిపణి దాడులు కొనసాగిస్తున్నాయి. ఇందులో భాగంగా... మంగళవారం తెల్లవారుజామున టెల్ అవీవ్ లక్ష్యంగా టెహ్రాన్ క్షిపణులు ప్రయోగించిందని.. దక్షిణ, మధ్య ఇజ్రాయెల్ ను లక్ష్యంగా చేసుకొని దడులు చేసిందని ఐడీఎఫ్ వెల్లడించింది. ఇదే సమయంలో... ఇరాన్ తాజాగా జరిపిన క్షిపణి దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ వాసులు చనిపోయినట్లు ఎమర్జెన్సీ సర్వీస్ మేనేజ్‌మెంట్ పేర్కొంది. ఇజ్రాయెల్ కాలమానం ప్రకారం ఉదయం 7:15 గంటల తర్వాత కూడా దాడులు జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు ఐడీఎఫ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది! ఈ నేపథ్యంలో ట్రంప్ మరోసారి స్పందించారు. ఇందులో భాగంగా.. నేటి తెల్లవారుజామున ఇజ్రాయెల్ – ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయని చెప్పిన ట్రంప్... ఇప్పటినుంచి సుమారు ఆరు గంటల తర్వాత ఇరు దేశాలు పరస్పరం తుదివిడత దాడులు పూర్తి చేసుకొని గాయపడిన తర్వాత కాల్పుల విరమణకు అంగీకరించాయని అన్నారు. తొలుత ఇరాన్ కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత 12వ గంట నుంచి ఇజ్రాయెల్ కాల్పుల విరమణను మొదలుపెడుతుందని.. ఈ విధంగా 24 గంటల తర్వాత 12 రోజుల యుద్ధానికి అధికారిక ముగింపు లభిస్తుందని తెలిపారు. ఈ ఒప్పందం అమల్లో ఉన్న వేళ పరస్పరం శాంతియుతంగా, గౌరవ ప్రదంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ట్రంప్ మాటలు ఇలా ఉంటే ఇరాన్ వ్యవహారం మరోలా ఉందని అంటున్నారు. ఇరాన్ మాత్రం ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే తాము కాల్పుల విరమణ పాటిస్తామని చెబుతోంది. ట్రంప్ ప్రకటించిన 6 గంటల గడువు ముగిసిన తర్వాత కూడా ఇజ్రాయెల్ పై మరిన్ని క్షిపణులు ప్రయోగించినట్లు వార్తలొస్తున్నాయి. దీంతో... ఇరాన్ ఉద్దేశ్యం ఏమిటి అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఓ ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. తాజాగా ఈ విషయంపై స్పందించిన ఇరాన్... ఇజ్రాయెల్ తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని తెలిపింది. సీజ్ ఫైర్ అమల్లోకి వచ్చే ముందు చివరిసారిగా ఆ దేశంపై మిసైల్ అటాక్ చేసినట్లు తెలిపింది. దీనిపై స్పందించిన ఇజ్రాయెల్.. తాజాగా (చివరిగా) ఇరాన్ తమపై ఆరు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు తెలిపింది. దీంతో... చివరి పంచ్ మనదైతే ఆ కిక్కే వేరబ్బా అని ఇరాన్ భావించినట్లుందని అంటున్నారు నెటిజన్లు. ఆ సంగతి అలా ఉంటే... ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కోసం టెహ్రాన్ ను ట్రంప్ ప్రాధేయపడ్డారని.. ఖతార్ లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ విజయవంతంగా దాడి చేయగానే.. ఇజ్రాయెల్ తో బలవంతంగా కాల్పుల విరమణ అంగీకరింపజేశారని ఇరాన్ మీడియా చెప్పడం గమనార్హం.

## కి.మీ.కు రూ.5 ఖర్చు

### తొలిసారి ఆకాశంలో దూసుకెళ్లిన ఈవీ విమానం

ఈవీ స్కూటర్.. ఈవీ కారు.. ఈవీ బస్సు.. ఇలా ఎలక్ట్రిక్ వాహనాలు వాహన రంగంలో క్రియేట్ చేస్తున్న బజ్ అంతా ఇంతా కాదు. ఇలాంటి వేళ.. తాజాగా ఈవీ మరో సంచలనానికి తెర తీసింది. ఏకంగా ఈవీ విమానాన్ని తయారు చేయటమే కాదు.. చరిత్రలో తొలిసారి ఆకాశంలోకి దూసుకెళ్లింది. దీంతో.. ఈవీ విమానం ఇప్పుడు రియాల్టీలోకి వచ్చినట్లైంది. అమెరికాకు చెందిన బీటా టెక్నాలజీస్ కంపెనీ ఈ కొత్త చరిత్రకు తెర తీసింది. వాహన రంగంలో ఇదో విప్లవంగా అభివర్ణిస్తున్నారు. విమానయాన రంగానికి ఈవీ గేమ్ ఛేంజర్ గా మారుతుందని అంచనాలు వేస్తున్నారు. విమానయానానికి భారీ ఖర్చు.. ఈవీ కారణంగా చాలా తక్కువకే పూర్తి కానుంది. అమెరికాకు చెందిన సిద్ధం చేసిన ఆలియా సీఎక్స్ 300 పేరున్న ఈ ఈవీ విమానం నలుగురు ప్రయాణికులతో నడిపి చూశారు. అమెరికాలోని ఈస్ట్ హ్యాంప్టన్ నుంచి కెన్నడీ విమానాశ్రయం వరకు తొలి ప్రయాణం సాగింది. ఈస్ట్ హ్యాంప్టన్ – కెన్నడీ ఎయిర్ పోర్టుకు



మధ్య దూరం 130కి.మీ. నాటికల్ మైళ్లలో చెప్పాలంటే 70. ఈ దూరాన్ని ఈవీ విమానం 30 నిమిషాల్లో అధిగమించింది. ఇప్పుడు అందరూ మాట్లాడుకుంటున్నది దీనికి అయిన ఇంధన ఖర్చు. కేవలం 8 డాలర్లు మాత్రమే. అంటే.. మన రూపాయిల్లో రూ.694 మాత్రమే. అంటే.. కిలోమీటర్ కు రూ.5.30 మాత్రమే. సాధారణంగా ఈ దూరానికి ఒక హెలికాప్టర్ లో ప్రయాణిస్తే కనీసం 160 డాలర్లు అవుతుంది. అంటే.. మన రూపాయిల్లో రూ.13,885. అందులో 20 శాతం ఖర్చుతోనే ఈవీ విమానం ప్రయాణించటం ఆసక్తికరంగా మారింది. పైలెట్ కు ఇచ్చే వేతం.. విమానం నిర్వహణ..ఇతర ఖర్చులు మిగిలిన వాటికి ఎలానో.. దీనికి అంతే. కాకుంటే ఇంధనం ఖర్చు భారీగా తగ్గిపోవటమే ఈవీ విమానాల ప్రత్యేకతగా చెప్పాలి. ఈవీ విమానం లోపల ఎలాంటి శబ్దం ఉండదని..ప్రయాణికులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం మరింత సులువుగా ఉంటుందని చెబుతున్నారు. ఈ ఈవీ విమానం (ఆలియా)ను ఒకసారి ఛార్జింగ్ పెడితే 250 నాటికల్ మైళ్లు. కిలోమీటర్లలో చెప్పాలంటే 463గా చెప్పొచ్చు. దగ్గర దూరాలకు ఈ విమానాలు సరిపోతాయని చెప్పొచ్చు. అయితే.. ఈ విమానానికి ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ గుర్తింపు తెచ్చుకుంటే.. వాణిజ్య అవసరాలకు వీటిని ఉపయోగించుకునే వీలుంటుంది. రాబోయే రోజుల్లో ఈ ఈవీ విమానాలు ఎయిర్ ట్యాక్సీలుగా పని చేస్తాయని చెబుతున్నారు. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్ తో జరిగే ఒలింపిక్స్ లో ట్రాఫిక్ చిక్కులకు ఈ బుల్లి విమానాలు ఎంతో సాయం చేస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సినిమా 'షో'

## నటి పిల్లల్ని ట్రోల్ చేస్తే కార్‌తో గుద్దించేస్తుందట

సోషల్ మీడియా యుగంలో ట్రోలింగ్ సర్వ సాధారణంగా మారింది. ప్రతి చిన్న అంశంపైనా చర్చలు, కామెంట్లు తీవ్రంగా మారాయి. ఇటీవల స్టార్ కిడ్స్ పై ఘోరమైన ట్రోలింగ్ సాగుతోంది. ముఖ్యంగా బాలీవుడ్ లో నటవారసుల అందచందాలు, విలాసాలు, లెగసీ వైఫల్యాలపై టార్గెట్ చేస్తూ కామెంట్లు వినిపిస్తున్నాయి. అయితే తన పిల్లలను ఎవరైనా కించపరుస్తూ కామెంట్ చేస్తే సీనియర్ నటి కాజోల్ అయితే ఏం చేస్తుందో తెలుసా? ఇదే ప్రశ్న కాజోల్ ని ప్రశ్నించింది మీడియా.. దీనికి స్పందించిన ఈ మేటి కథానాయిక.. –నా కార్ ఎదుటకు రావొద్దని చెబుతాను.. ఎందుకంటే మీదికి ఎక్కించి తొక్కించేస్తాను! – అని సరదాగా వార్నింగ్ ఇచ్చారు. కాజోల్ ప్రస్తుతం మా సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉన్నారు. ఈ హారర్ థ్రిల్లర్ లో తన కుమార్తెను కాపాడుకునే తల్లి పాత్రలో కాజోల్ అద్భుతంగా



నటించారని ప్రశంసలు కురుస్తున్నాయి. నిజ జీవితంలోను తన పిల్లల జోలికి వస్తే కాజోల్ ఎలా ప్రవర్తిస్తారు? అనేది ప్రశ్న. ఒకప్పుడు అస్సలు సహించే స్థితిలో లేనని కాజోల్ తెలిపారు. –పిల్లలను కాపాడుకునే తల్లిగా, ఒకప్పుడు చాలా సీరియస్ గా ఉండేదానిని... ఇప్పుడు కొంత కూల్ గా ఉన్నాన–ని కూడా కాజోల్ అన్నారు. సోషల్ మీడియాలు, ట్రోలింగ్ జీవితాల్లో చిన్న భాగం.

దానికి బదులుగా సానుకూల అంశాలపై దృష్టి పెట్టాలని తన పిల్లలకు సలహా ఇచ్చినట్టు కాజోల్ తెలిపారు. సోషల్ మీడియాల్లో అలా మాట్లాడేవారు ఒక శాతం లేదా 0.1 శాతం మాత్రమే ఉంటారు. ఆ వ్యాఖ్యల్లో నిజమెంతో ఎవరికీ తెలీదు. అలాంటి వాటిపై కాదు..మీరు మంచిపై దృష్టి పెట్టాలి! అని కాజోల్ అన్నారు.

## సుందరి ఇలా భయపడితే ఎలా?



స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి రిలీజ్ అయితే బాక్సాఫీస్ వద్ద వార్ తప్పదు. రిలీజ్ ల విషయంలో హీరో లెవరు రాజీ పడే పరిస్థితి ఉండదు. ఒకరికొకరు సై అంటూ దూసుకొస్తారు. పోటీగా ఎన్ని సినిమాలున్నా సరే ఆ సీజన్ టార్గెట్ గా బరిలోకి దిగుతుంటారు.

బాక్సాఫీస్ వద్ద ఇలాంటి పోటీ వాతావరణం ఎన్నోసార్లు చూసిం దే. అన్ని చిత్ర పరిశ్రమలోనూ ఇలాంటి పోటీ కనిపిస్తుంటుంది. ఇలాంటి కాంపిటీషన్ నుంచి ఎగ్జిట్ అయ్యేది చిన్నా చితకా చిత్రాలు తప్ప! పెద్ద చిత్రాలేవి తప్పుకోవు. అయితే బాలీవుడ్ లో ఓ స్టార్ హీరో, హీరోయిన్ నటిస్తున్న చిత్రం మాత్రం ఇలాంటి పోటీ నుంచి ఎగ్జిట్ అయి ఆశ్చర్య పరిచింది. వివరాల్లోకి వెళ్తే జులైలో బాలీవుడ్ నుంచి చాలా సినిమాలు రిలీజ్ అవుతు న్నాయి. చాలా కాలంగా కొత్త రిలీజ్ లు లేక బోసి బోయిన బాలీవుడ్ థియేటర్లు జులైలో కొత్త రిలీజ్ లతో కళకళ లాడనున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దార్థ్ మల్హోత్రా, జాన్వీకపూర్ జంటగా తుషాల్ జలోటా తెరకెక్కించిన %–%పరమ్ సుందరి – కూడా జులై 25న రిలీజ్ తేదీ ఫిక్స్ చేసుకుంది. అధికారికంగా రిలీజ్ తేదీ కూడా ప్రకటించారు. అయితే ఇప్పుడీ సినిమా వాయిదా పడిందని సమాచారం. అందుకు కారణం ఆ నెలలో చాలా సినిమాలు రిలీజ్ కు ఉండటంతోనే తమ చిత్రాన్ని వాయిదా వేసుకో వాలని మేకర్స్ భావిస్తున్నారుట. అన్ని అనుకూలంగా ఉంటే ఆగస్టులో రిలీజ్ చేయాలనుకుంటున్నా రుట. దీంతో పరమ్ సుందరి కంటెంట్ పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజల్ట్ ముందే ఊహించి పోటీలో ఎందుకని వాయిదా వేస్తున్నారా? లేక పోటీని తట్టుకుని నిలబ డలేదని వాయిదా వేస్తున్నారా? ఇదేం చిన్న సినిమా కాదే? స్టార్ క్యాస్టింగ్ ఉన్న చిత్రమే ? వాయిదా ఏ కారణంగా అంటూ నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ చిత్రాన్ని దినేష్ విజన్ నిర్మిస్తున్నారు.

## ఎన్టీఆర్ తో మరో దర్శకుడు.. సెట్టయినట్లేనా?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం తెలుగు సినీ ఇండస్ట్రీలో మోస్ట్ బిజీ హీరోలలో ఒకరిగా కొనసాగుతున్నాడు. ఇప్పటికే బాలీవుడ్‌లో హృతిక్ రోషన్‌తో కలిసి "వార్ 2" సినిమాతో గ్రాండ్ ఎంట్రీకి సిద్ధమవుతున్నాడు. ఇకపోతే తెలుగు సినిమా పరంగా ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ డ్రాగన్ షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. ఇక ఈ ప్రాజెక్ట్ తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో రూపొందే దేవర 2, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో మరో సినిమా లైన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఈ లైనప్ మధ్యనే ఇంకో క్రేజీ కాంబినేషన్ కూడా బజ్‌లోకి వచ్చి ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అదే కోలీవుడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తో ఎన్టీఆర్ చేయబోయే సినిమా. తాజాగా నెల్సన్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ నిర్మాత



నాగవంశీ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ఈ హైప్‌కి బలాన్నిస్తోంది. మా డియరెస్ట్ నెల్సన్ దిలీప్ కుమార్ కి హ్యాపీ బర్త్ డే. అతి త్వరలోనే బిగ్ స్క్రీన్ ట్రీట్ మళ్లీ వెనక్కి రాబోతుంది అనే కామెంట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఇది కచ్చితంగా ఎన్టీఆర్‌తో చేసే సినిమాకే సంకేతమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. నెల్సన్ గతంలో విజయ్ తో "బీస్ట్", రజనీకాంత్ తో "జైలర్" వంటి భారీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించాడు. "జైలర్" మెగా బ్లాక్ బస్టర్ కావడంతో తమిళ ఇండస్ట్రీలో అతడికి మంచి మార్కెట్ ఏర్పడింది. అలాంటి నెల్సన్ ఇప్పుడు ఎన్టీఆర్ లాంటి మాస్ హీరోతో జతకడితే, అది అసలైన ఫైర్ కాంబో కానుంది. పైగా పాన్ ఇండియా రేంజ్‌లో సెట్ చేయదగిన కాంబినేషన్ ఇది కావడం విశేషం. ఇప్పటికే ఎన్టీఆర్ లైనప్ చాలా బిజీగా ఉంది. కానీ పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ప్రకారం, ఈ ప్రాజెక్ట్ ముందుగా ప్లాన్ చేసిన లైనప్‌లో కొన్ని మార్పులు జరగొచ్చని అంటున్నారు. ఎప్పుడు అయినా గ్రీన్ సిగ్నల్ వస్తే, నెల్సన్ – ఎన్టీఆర్ మూవీ త్వరలోనే సెట్స్ పైకి వెళ్ళే అవకాశముంది. ఈ కాంబి నేషన్ ఖచ్చితంగా భారీ మాస్ ఎంటర్టైనర్‌కి అవకాశం కల్పించనుంది. మరి ఏం జరుగుతుందో తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417